

తొమ్మిదవ భాగము

"జోన్ సక్రీ! నిన్ను చూశాను. నీ దగ్గర ఆనందం పొందాను. నువ్వు ఇండియన్ కదా. నిన్ను చూస్తుంటే ఇండియాగా చూసినట్లుంది. ఇండియాలో తిరిగి ఆనందం పొందినట్లుంది" అంది డెల్లా నన్నే చూస్తూ.

"డెల్లా! ఐ లవ్ యూ!" అన్నాను ప్రేమగా చేయి నొక్కుతూ.

"మీ టూ! ప్రాణాలతో బైటపడి క్షేమంగా దేశం చేరుకోగలిగితే వెంటనే అక్కడే పెళ్ళి చేసుకుందాం!"

అంది నా భుజంపైన చెయ్యివేసి, పైకి వంగి, నా పెదాలపైన గట్టిగా ముద్దుపెడుతూ.

ఆమె రొమ్ములు నా గుండెకు ఘట్టిగా తగిలాయి. ఆ స్పర్శకు నాలో క్రొత్త ధైర్యం, ఆత్మస్థైర్యం పుట్టుకొచ్చాయి. ఆవేశంతో డెల్లాను నా హృదయానికి గట్టిగా హత్తుకున్నాను.

డెల్లా కళ్ళు ఆనందంతో మెరిశాయి. మా ఇరువురి మధ్య మౌనం ఐదునిముషాలు రాజ్యం చేసింది.

"నేను రెస్ట్ తీసుకుంటాను. నువ్వు కాస్త చూస్తుండు. ఈ మారు తలుపులు తడితే కాల్చి పారెయ్యి. ఎవడో ఒకడు ఛస్తాడు" అంది డెల్లా మౌనాన్ని పారద్రోలుతూ.

సరేనన్నాను తుపాకి సరిచేసుకుంటూ.

డెల్లా దిండు సర్దుకుని పడుకుంది మంచంపైన.

నేను మంచం దిగి తలుపుదగ్గరకు నడిచాను. అంతకు ముందు బరిసె గుచ్చి తీసినందువల్ల ఏర్పడ్డ రంధ్రంలో నున్నుంచి వెలుపలేం జరుగుతుందో చూడసాగాను.

నాలుగైదు తెల్లని పాలిథిన్ బస్తాలు అక్కడ వేసి వున్నాయి. వాటి నానుకొని నన్నూ డెల్లాను అంతకు ముందు బంధించిన నాయకుడు నిలబడున్నాడు. అతని చేతిలో విస్కీ సీసా వుంది. తడవకు సగం మించి మింగుతున్నాడు.

సూట్లతో వున్న ఇద్దరు వ్యక్తుల చేతుల్లో కూడా గ్లాసులున్నాయి. ఒకతను గ్లాసుక్రింద పెట్టి రెండో కాబిన్ లోకి వెళ్లాడు. అందులోంచి విస్కీ బాటిల్స్ కేస్ ఒకటి తెచ్చి నాయకుడి ముందు పెట్టాడు. అతని వెంట వున్న ఇద్దరు అనుచరులు దాన్ని నెత్తికెత్తుకొన్నారు.

ఆ నాయకుడేదో అర్ధంగాని భాషలో వాళ్ళతో ఏదో చెప్పాడు. అదే భాషలో వాళ్ళుకూడా ఏదో చెప్పారు. అందరూ నవ్వుకొన్నారు. ఆ తర్వాత నాయకుడే వంగి సలాంచేశాడు. అక్కడ్నుంచి నిష్క్రమించాడు. అతను వెళ్ళినవైపే చూస్తూ నిల్చున్నారు, ఇద్దరు సూట్స్‌లో వున్న వ్యక్తులు.

"ఈమారు చాలా ఎక్కువ సరుకు తెచ్చారు వీళ్ళు.

అమ్మితే మనకు ఏంలేదన్నా లక్ష డాలర్లు దొరుకుతాయి" అన్నాడొకడు.

"అవును. స్మగ్లింగ్ గాంగ్స్ వాళ్ళకు అమ్మామంటే రెండు లక్షల డాలర్ల ఖరీదుచేసే బంగారం దొరుకుతుంది" రెండో అతను చెప్పాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

"ఈ దీవినిండా గంజాయి మొక్కలు విపరీతంగా వున్నాయి. మనం ఇచ్చే విస్కీ బాటిల్స్ ఖరీదుకు, వాళ్లు తెచ్చి ఇచ్చే సరుకు విలువకు పోల్చుకుంటే మనం వాళ్ళను ఎంతగా దోచుకుంటున్నదీ అర్థమవుతుంది!" అన్నాడు మొదటి వ్యక్తి.

"అదిసరే! ఆ కాబిన్‌లో వున్న వాళ్ళను ఏంచేద్దాం?" అడగాడు అతను సిగరెట్ వెలిగించుకోవడం పూర్తిచేసి, అగ్గిపుల్ల ఆర్పి సముద్రంలోకి విసురుతూ.

"చంపేద్దాం! మనం వంతుల ప్రకారం కాపలా కాద్దాం! వాళ్ళు తలుపు తెరవడం గమనించగానే కాలుద్దాం!" అన్నాడు.

బోటు నడుస్తూనేవుంది. ఎక్కువ స్పీడుగా పోవడం లేదు. మెల్లగా పోతూంది. సన్నగా వాన తుంపరలు పడసాగాయి.

వెలుపల వాళ్ళేం చేస్తున్నారో చూద్దామని మళ్ళీ ప్రయత్నించాను. కానీ వాళ్ళ జాడలేదు. నాకు కేబిన్‌లో తలుపు మూసుకుని ఖైదీగా కూర్చోడం కష్టంగావుంది. అయినా చేసేదేమీ లేక చూస్తూ కూర్చున్నాను.

డెల్లా పరుపుపైన హాయిగా పడుకుంది. లోపల రూం చీకటిగా వుంది. గాలికూడా సరిగాలేదు లోపల. కిటికీ తలుపులు తీస్తే కాస్త గాలి వస్తుంది. కానీ అవి తీసిపెట్టు కొనడం ప్రమాదం.

వాన జోరు హెచ్చినట్లు సముద్రం పైనుండి వస్తున్న

శబ్దం ద్వారా అర్థం చేసుకున్నాను.

బోటు ఆగిపోయింది. ముందుకు కదలడం లేదు. గాలి కూడా ప్రారంభమయింది. అటూ ఇటూ విసురుగా ఊగ సాగింది బోటు.

డెల్లా మౌనంగా కూర్చుంది.

దభీమని బోటుపైన ఏదో పడింది. ఒక్క వుదుటున క్రిందకు నీళ్ళలోకి దిగబడిపోతున్నట్లయింది మాకు. కిటికీ తలుపులు ఊడిపోయాయి. పైప్ లోంచి వచ్చినట్లుగా వచ్చాయి నీళ్ళు.

డెల్లా బిక్కచచ్చి, నా దగ్గరగా వచ్చి నిలబడింది. నేను ఆమె చెయ్యి పట్టుకుని భయపడవద్దన్నట్లు కళ్ళతోనే ధైర్యం చెప్పాను.

"ఏమవుతూంది?" అడిగింది.

"తుఫాను రేగినట్లుంది. నీళ్ళు పైకిలేచి పెద్ద పెద్ద అలల్లా బోటును చుట్టుముట్టి కొట్టుకొంటూ వుండాలి" అన్నాను.

నా మాటలు ముగియకుండానే బోటు తల్ల క్రిందులయింది. ఇద్దరం పడిపోయాం. మళ్ళీ మామూలు స్థితికి వచ్చింది. సర్దుకుని కూర్చున్నాం. అలా గిరగిర తిరుగుతూనే వుంది రంగుల రాట్నంలా.

మా ఇద్దరి తలలూ, కాళ్ళు, మంచానికి, కుర్చీలకు కాబిన్ గోడలకు కొట్టుకొన్నాయి. అక్కడక్కడా గాయాలయినాయి. రక్తం కూడా కారసాగింది. అయితే మత్తుగా విస్కీ త్రాగి వున్నాను కాబట్టి తెలీలేదు.

బోటులోని మిగిలిన ఇద్దరు ఆగంతకులు ఏమయినారో నాకు తెలీలేదు. వెళ్ళి చూద్దామనిపించింది. కానీ డెల్లాను వదలి వెళ్ళడం ఇష్టంలేక అక్కడే కూర్చున్నాను.

వాన జోరు తగ్గినట్లు లేదు.

గాలి జోరు హెచ్చుతున్నట్టుగా వుంది.

చేయగలిగిం దేమీ లేదు కాబట్టి భగవంతుణ్ణి ప్రార్థిస్తూ మౌనంగా చూస్తూ కూర్చున్నాను. కాబిన్‌లో మోకాలు లోతున నీళ్ళు నిలబడి వున్నాయి. డెల్లా, నేనూ ఇద్దరం మంచంపైనే కూర్చున్నాం.

అలా మూడు గంటలుపైనే గడచిపోయాయి. తుఫాను తగ్గనేలేదు. పోనుపోనూ తీవ్రత ఎక్కువవుతున్నట్లుగా తోచింది నాకు. గాలికూడా ఎక్కువ వేగాన్ని పుంజు కుంది.

తెల్లవారేందుకెంతో వ్యవధి వుండదని తోచింది నాకు. భయంకరంగా సముద్రంపైనుండి వస్తున్న శబ్దాలను వింటూ కూర్చుని, నాకు నేనే ధైర్యం చెప్పుకుంటున్నాను తప్ప, ప్రమాదాన్ని మాత్రం ప్రతిక్షణం ఊహిస్తూనే వున్నాను.

మా బోటు వెనక్కు కదలింది. బహుశా గాలి నెడుతూ వుండాలనిపించింది.

ఆ కదలికలో వేగం హెచ్చి స్పీడుగా పోసాగింది. అదీ పిచ్చి వేగంతో పోతూన్నట్లు గమనించాను. తుఫాను తీవ్రతరమైన దనడానికి అదే గుర్తు. నాలుగైదుసార్లు ఢీంకీలు కొట్టి మళ్ళీ తట్టుకుని నిలబడింది.

మాతోపాటు బోటులోవున్న మిగిలిన ఇద్దరూ ఏ మయ్యారో నా కర్థం కాలేదు. బహుశా వాళ్ళ కాబిన్‌లోంచి వెలుపలకొచ్చి మా సంగతి చూచేంత ధైర్యం, అవకాశం వాళ్ళకు వుండివుండదనుకున్నాను.

చెవులు చిల్లులుపడేట్లు ఢామ్మని శబ్దమైంది.

డెల్లా నన్ను గట్టిగా పట్టుకుంది. ఏంజరిగిందీ అర్థం కాలేదు. కానీ మరుక్షణంలో నేను నీళ్ళలో వున్నానని గ్రహించాను. కాలిక్రింద బోటు తాలూకు భాగం తగల లేదు. నేల అంతకన్నా లేదు. అంటే సముద్రంలో పడి

పోయాయని ఊహించాను.

డెల్లాను ఒక చేత్తో పట్టుకునే ఈదుతూ మునిగి పోకుండా వుండేందుకు ప్రయత్నం చెయ్యసాగాను. కళ్ళు తెరచిచూశాను. చీకటిగావుంది. చుట్టూ నీళ్ళు.

కుడివేపు అలలు చిన్నచిన్నవి కనుపించాయి. వాట్ని బట్టి నేను ఏదో తీరానికి దగ్గరగా వున్నానని గ్రహించాను.

మెల్లగా డెల్లాను వెంటవేసుకుని అటు వేపు ప్రయాణం మొదలెట్టాను. బోటు తాలూకూ చెక్కలు రెండు మూడు నాకు ఎదురొచ్చాయి. వాట్ని చూచి మా బోటు ముక్కలు ముక్కలయి వుండాలనుకొన్నాను.

గంటసేపు తంటాలు పడ్డాను. నీళ్ళ లోతు తగ్గిపోయింది.

డెల్లాను నడిపించుకుంటూ వచ్చి సముద్రపు ఒడ్డున వచ్చి పడ్డాను. అక్కడ్నుంచి ముందుకు కదలేందుకు కాళ్ళల్లో సత్తువలేదు నాకు. బోరగింతలా పడుకున్నాను. డెల్లాకూడా నా ప్రక్కే పడుకుంది.

అలా ఎంతోసేపు పడివుండి పోయాం చనిపోయిన శవాల్లా.

చీకటిని తరుముతూ వెలుగురావటం గమనించాను. ఆ తర్వాత అరగంటకు సూర్యకిరణాలు నాపైన పడ్డాయి. లేచి కూర్చున్నాను. డెల్లానుకూడా లేపాను.

"ఈమారు తప్పుకొంటామన్న నమ్మకం నాకు లేనే లేదు!" అంది డెల్లా తల్లోకి దూరిన ఇసుకను విదిలించుకుంటూ.

"నాకూ అంతే! కానీ భగవంతుడి దయవల్ల బ్రతికి బయట పడతామన్న నమ్మకం మాత్రం కొద్దిగా వుంది" అన్నాను.

"ఇదేదో క్రొత్త ప్రదేశంలా వుందికదూ?" అడిగింది డెల్లా.

నేను కనుచూపుమేర దూరం సర్వే చేసి చూసి అవునన్నట్లు తలూపాను.

"మనమేం చేద్దాం?" అడిగింది డెల్లా.

"చేసేందుకేముంది. మెల్లగా దీవిలోకి వెళ్ళాం. ఆ మనుషుల్ని చూద్దాం. మనకు మనదేశమెళ్ళేందుకేమైనా మార్గం దొరికేదాకా ఇక్కడ వుండాల్సిందేగా. వీలైనంతవరకు ఇక్కడివాళ్ళతో సర్దుకుపోవటం అవసరం" అన్నాను.

డెల్లా మరేం మాట్లాడలేదు.

ఇద్దరం లేచాం. మెల్లగా నడక సాగించాం. చాలా దూరం మా కళ్ళకు ఇసుకమేటలు కనిపించ సాగాయి. చెట్లు అసలు కనుపించనే లేదు. రెండు గంటలు నడిచాం ఆ ఇసుకలోనే. అప్పటికీ చెట్ల జాడగానీ, పక్షుల అలికిడి గానీ లేదు.

"ఇదేమైనా ఎడారి ప్రదేశమా?" అడిగింది డెల్లా.

"కావడానికి వీల్లేదు. మనం ఇంతకుముందు విడిదిచేసిన రెండు ద్వీపాలకు మధ్యలో వుండివుండాలి ఇది. అంటే అక్కడ వాతావరణమే ఇక్కడా వుంటుంది. కాకుంటే సముద్రతీరంలో కాస్త ఎక్కువ విశాలంగా ఇసుకమేటలు వేసివుంటుందనుకుంటాను" నా అభిప్రాయాన్ని చెప్పాను.

మా ఇద్దరికీ నోరెండిపోయింది. ఎక్కడా చుక్క నీళ్ళు లేవు. అందులో సముద్రపుటొడ్డున పడివుండడం వల్ల ఉప్పగాలికి నాలిక నాకు పిడచకట్టుకుని వుంది.

"దాహంగా వుంది!" అంది డెల్లా.

"నాకూనూ, ఇంకొంచెం దూరం నడిస్తేగానీ మనకేమీ కనుపించేట్లు లేదు" అన్నాను నడుస్తూనే.

మరో అరగంట నడిచాం. ఇసుక మేటలు పల్చబడ్డాయి. దూరంగా చిన్న చిన్న చెట్లు కనిపించాయి. వాట్ని చూడగానే నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. డెల్లా కేసి చూశాను. ఆమె కళ్ళల్లో మెరుపు కనిపించింది.

ఆ చెట్లను దాటి కొంతదూరం వచ్చాం. అక్కడో చిన్న నీళ్ళగుంట కనుపించింది. తిన్నగా వెళ్ళి కడుపు నిండా తాగాం నీళ్ళు. నీళ్ళు మాత్రం మట్టి మట్టిగా వున్నాయి. నాకున్న దాహంలో ఆ నీళ్లలావున్నదీ కూడా గమనించ లేదు. తాగాక మాత్రమే శుభ్రంగా లేవని తెలుసుకొన్నాను. డెల్లా కూడా నీళ్ళు తాగింది.

ఇద్దరం ఆ ప్రక్కనే ఒక చెట్టునీడన విశ్రాంతి తీసుకోనేందుకు కూర్చున్నాం.

"మనం ఈ జన్మలో మళ్ళా మన దేశాలకు చేరతామా రాజ్?" దిగులుగా అడిగింది డెల్లా.

ఆమె పైకి కనబరిచిన అనుమానం నాకు లోలోపల వుంది. మగవాడ్ని ఆమెముందు అధైర్యపడుతూ మాట్లాడటం అవమానంగా భావించాను. అందుకే ఆమెకు ధైర్యం చెప్పాను.

అక్కడో గంటసేపు కూర్చున్నాం. ఆ తర్వాత మెల్లగా లేచి మళ్ళీ నడక మొదలుపెట్టాం. మూడు మైళ్ళకు పైనే నడిచి వుంటాం. మాకు కుడివేపు చిన్న తోట కనుపించింది. అందులో చెట్లు వున్నాయి. వాటి కొమ్మలకు ఎర్రటిరంగు బత్తాయి కాయిల్లాంటి పండ్లు కనుపించాయి. డెల్లా తోటను చూసి "ఆకలిగా వుంది? అవి తిందామా?" అంది.

నాకూ ఆకలేస్తోంది. డెల్లాను అక్కడే వుండమని చెప్పి, నేను కంచెలో చిన్న త్రోవ చేసుకుని తోటలోకి దూరాను. చెట్టు మెల్లగా ఎక్కి, పండ్లు తెంపి క్రింద

పడేశాను. తర్వాత నేను చెట్టు మొదట్లో నుండి క్రిందకు ఒక్క దుముకుతో దిగాను. పండ్లేరుకొనేందుకు వంగాను.

"భౌ! భౌ" మంటూ నల్లటి కుక్కలు రెండు నావైపు వచ్చాయి.

తలెత్తి చూశాను. ఒక్కొక్కటి నాలుగు అడుగుల ఎత్తున వుంది. వాటి కళ్ళు తళతళ మెరుస్తున్నాయి. నేను లేచి నిలుచున్నాను. నాకు ఆడుగు దూరంలో ముందొకటి వెనుకొకటి నిలుచున్నాయి.

వాటితో కలబడి ప్రయోజనం లేదని అర్థమైంది నాకు. ఎలా తప్పించుకోవాలని ఆలోచించ సాగాను. అవిమాత్రం నన్ను కాలు కదలనీకుండా నిలబెట్టేశాయి.

వాటి అరుపులు విని నల్లగా పొట్టిగావున్న మనిషి నావైపు వచ్చాడు.

అతన్ని పరిశీలనగా చూశాను. నల్లమొద్దులా వున్నాడు. వొంటిమీద బట్టలులేవు. జుట్టు మెలికలు తిరిగిపోయివుంది. దవడలు పెద్దవిగా వున్నాయి. లావుపాటి పెదాలు నల్లగా వున్నాయి. మనిషిమాత్రం కుక్కలకన్నా ఎత్తు వుండడని పించింది.

అతని చేతిలో పొడవుపాటి కర్రవుంది. దాని చివర్న శూలంలా బిగించిన కత్తి వుంది. ఎండలో దాని ఛాయ మిలమిల మెరుస్తున్నాయి.

నావేపు చూసి ఏదో అడిగాడతను. అతని భాష నా కర్థంకాలేదు. కుక్కలు దూరంగా తప్పుకున్నాయి. అతని మాటలు కుక్కల అరుపుల్లాగే వున్నాయి.

నా భాష అతనికెటూ అర్థంగాదని తెలుసు కాబట్టి సైగలుచేసి చెప్పాను, ఆకలవుతూంటే పండ్లు కోసు కునేందుకు వచ్చామని.

—(సశేషం)